క్లుప్తంగా

నేడు అభివృద్ధి పనుల ప్రారంభం

రంగంపేట: మండల పరిధిలోని కోటపాడు గ్రామంలో పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి బుధవారం ప్రారంభిస్తారని మండల పంచాయతీరాజ్ జేఈ కమ్మసత్తి శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ కోటపాడు గ్రామంలో రూ.43.60 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం, రూ.20.80 లక్షలతో నిర్మించిన వెలెనెస్ భవనం, రూ.31 లక్షలతో ఏర్పాటు చేసిన మంచినీటి పథకాలను ఎమ్మెల్యే ప్రారంభిస్తారని చెప్పారు.

నిధుల దుర్వినియోగంపై విచారణ



దుప్పలపూడి పంచాయతీ రికార్డులను తనిఖీ చేస్తున్న విచారణ బృందం

అనపర్తి: మండలంలోని దుప్పలపూడి సర్పంచ్, పంచాయతీ కార్యదర్శులిద్దరూ వారి సొంత బ్యాంకు ఖాతాలకు పంచాయతీ నిధులు మళ్లించుకుని దుర్వినియోగానికి పాల్పడ్డారంటూ అందిన ఫిర్యాదుపై ప్రత్యేక బృందం విచారణ చేపట్టింది. జిల్లా పంచాయతీ అధికారి జె.సత్యనారాయణ ఆదేశాల మేరకు బిక్కవోలు ఈఓపీఆర్డీ జి.భవానితో పాటు బిక్కవోలు మండలం కొమరిపాలెం, పందలపాక పంచాయతీ కార్యదర్శులతో కూడిన ప్రత్యేక బృందం మంగళవారం దుప్పలపూడి చేరుకుని పంచాయతీ రికార్డులను పరిశీలించి తనిఖీలు చేపట్టారు. బుధవారం కూడా ఈ తనిఖీలు కొనసాగనున్నాయి. పూర్తి పారదర్శకంగా విచారణ చేపట్టి వారంలోగా ఉన్నతాధికారులకు నివేదికను సమర్పిస్తామని బిక్కవోలు ఈఓపీఆర్డీ జి.భవాని విలేకరులకు తెలిపారు.

స్వామిత్ర సర్వే వేగవంతం చేయండి

బిక్కవోలు: స్వామిత్ర సర్వే వేగవంతం చేయాలని ఈఓపీఆర్డీ బి.భవాని అన్నారు. మంగళవారం మండలంలోని పందలపాక సచివాలయం-1లో ఆమె సర్వే వివరాలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో సర్వే వేగంగా పూర్తి చేయాలన్నారు. లబ్ధిదారులకు ముందుగా నోటీసులు ఇచ్చి వారి అభిప్రాయాలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రసాద్, డిజిటల్ అసిస్టెంట్ సూరిశెట్టి సురేష్, మహిళ సంరక్షణ కార్యదర్శి వెలగల విజయలక్ష్మి, సర్వేయర్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.


ఆర్బీకే చైర్మన్ వెంకట్రాజుకు అభినందనలు



వలవల వెంకట్రాజు

సీతానగరం: రైతు భరోసా కేంద్రాల (ఆర్బీకే) మండల చైర్మన్‌గా నియమితులైన సీతానగరానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు వలవల వెంకట్రాజు (తోటలో రాజు)కు పలువురు అభినందనలు తెలుపుతున్నారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ఇటీవల ఆయనకు ఈ పదవి కేటాయించిన విషయం తెలిసిందే. వలవల వెంకట్రాజు గతంలో పంచాయతీ ఉప సర్పంచ్‌గా సేవలు అందించారు. వైఎస్సార్ సీపీ ఆవిర్భావం నుంచీ పార్టీ పురోగతికి ఎనలేని కృషి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, పార్టీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి, ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పార్టీ యువజన విభాగం రీజినల్ కో ఆర్డినేటర్ జక్కంపూడి గణేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారం అనంతరం ప్రతిజ్ఞ చేస్తున్న కర్రి రుక్మిణి

అనపర్తి: ఇటీవల జరిగిన ఉపఎన్నికల్లో మండలంలోని రామవరం గ్రామ పంచాయతీ 3వ వార్డు సభ్యురాలిగా ఏకగ్రీవంగా ఎన్నికైన కర్రి రుక్మిణికుమారి మంగళవారం గ్రామ సచివాలయంలో ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం వార్డు సభ్యురాలు రుక్మిణికుమారి, మంగిరెడ్డి దంపతులను సర్పంచ్ గిరడా గంగాభవాని, అనపర్తి ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, ఎంపీటీసీలు గొలుగూరి గౌతమి, నల్లమిల్లి భాగ్యలక్ష్మి తదితరులు సత్కరించారు.

యువకులకు గాయాలు

మధురపూడి: రోడ్డు పక్కనే ఆగిఉన్న కారును ఢీకొని ఇద్దరు యువకులు గాయాలపాలయ్యారు. స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం .. రాజమహేంద్రవరం నుంచి కోరుకొండ వైపునకు మోటార్ సైకిల్‌పై సాయి, అనిల్ అనే యువకులు సోమవారం రాత్రి వేగంగా వెళుతున్నారు. దారిలో గ్యాస్‌బండల లారీని ఓవర్ టేక్ చేశారు. అనంతరం రోడ్డు పక్కనే నిలిపి ఉన్న కారును ఢీకొని రోడ్డుపై పడ్డారు. తీవ్ర గాయాలపాలైన వారిని స్థానికుల సహకారంతో అంబులెన్స్‌లో రాజమహేంద్రవరంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

ట్రాఫిక్ రణరంగం..

- రాజానగరంలో ట్రాఫిక్ కష్టాలు
- అడుగు వేయాలంటే అరగంట
- ఉదయం, సాయంత్రం వేళల్లో సమస్య జటిలం



రాజానగరం గాంధీబొమ్మ సెంటర్‌లో వాహనాల రద్దీ

రాజానగరం: నియోజకవర్గ కేంద్రమైన రాజానగరంలో రోజురోజుకూ తీవ్రమవుతున్న ట్రాఫిక్ సమస్యతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. గ్రామంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మౌలిక సదుపాయాలు కరువయ్యాయి. ముఖ్యంగా వివిధ రకాల వ్యాపార లావాదేవీలకు కూడలి ప్రాంతమే పరిమితమైంది. దీంతో ప్రధాన రోడ్డు ఆక్రమణల బారిన పడి, ఇరుకైపోవడంతోనే ఈ సమస్య ఎదురవుతోంది. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో గాంధీ బొమ్మ సెంటర్ నుంచి మార్కెట్ ప్రాంతం వరకూ ఉన్న ఫర్లాంగు దూరాన్ని దాటి వెళ్లాలంటే గంటల సమయం పడుతోంది.

300 ఏళ్ల నాటి మార్గాలే..

సుమారు 300 ఏళ్ల సుదీర్ఘ చరిత్ర కలిగిన రాజానగరంలో ఆనాటి రోడ్డు మార్గాలనే తప్ప, వాటి విస్తరణ ఒక్క అంగుళం కూడా జరగలేదు. పూర్వం రావుల చెరువును ఆనుకుని రోడ్డు ఉండేది. కాలక్రమంలో చెరువుకు రోడ్డుకు మధ్య నివాసాలు ఏర్పడ్డాయి. దీనితో వివిధ రకాల వ్యాపారాలకు ఇదే కేంద్రంగా మారిపోయింది. సుమారు రెండు వేల మంది జనాభా ఉండే ఈ గ్రామంలో.. నేడు ఆ సంఖ్య 10 వేలకు పెరిగింది. కానీ మౌలిక సదుపాయాలు మాత్రం వృద్ధి చెందలేదు.

ఆక్రమణల చెర

జనాభా పెరుగుదలకు అనుగుణంగా రోడ్డును విస్తరించడం మాట అటుంచితే, ఉన్న రోడ్డును కూడా కాపాడుకోలేని పరిస్థితులు ఇక్కడ నెలకొన్నాయి. 30 నుంచి 35 అడుగుల వెడల్పుతో ఉండే రాజానగరంలోని ప్రధాన రోడ్డు దశాబ్దాకాలం క్రితం వరకూ జాతీయ రహదారిగా ఉండేది. బైపాస్ రోడ్డు వేయడంతో ఇది ఆర్‌అండ్‌బీ రోడ్డుగా మిగిలిపోయింది. జాతీయ రహదారిగా ఉంటే విస్తరణకు నోచుకునేదేమోగానీ, ఆర్‌అండ్‌బీకి అప్పగించిన తరువాత అటు, ఇటు ఆక్రమణలకు అడ్డాగా మారిపోయింది. అసలే చిన్నరోడ్డు, ఆపై ఆక్రమణలు, వాహనాల పార్కింగ్‌లతో ఇరుకుగా తయారైంది. ఎదురెదురుగా వచ్చే రెండు బస్సులు తప్పించుకునేంతగా జాగా లేకుండా పోయింది. ఈ కారణంగా ద్విచక్ర వాహనదారులు కూడా ముందుకు వెళ్లలేక అవస్థలు పడుతున్నారు.

కానరాని ట్రాఫిక్ నియంత్రణ

గ్రామంలోని కాన్వెంట్లు, కళాశాలకు వచ్చే విద్యార్థులతో నిత్యం ఉదయం, సాయంత్రం వేళల్లో స్కూల్ బస్సుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. దీనికి తోడు మంగళ, శుక్రవారాలలో జరిగే సంత సమయంలో ఈ సమస్య మరింత జటిలమవుతోంది. ఈ ప్రాంతానికి కూతవేటు దూరంలోనే పోలీసు స్టేషన్ ఉంది. కానీ కానిస్టేబుల్ కూడా గ్రామంలో ట్రాఫిక్ నియంత్రణ డ్యూటీలో ఉండరు. గతంలో మార్కెట్ ఏరియాలోనూ, గాంధీ బొమ్మ సెంటర్‌లోనూ ఇద్దరు కానిస్టేబుళ్లు, ఒక ఎస్సై ట్రాఫిక్ నియంత్రణ డ్యూటీ చేసేవారు. ఇటీవల కాలంలో ఏమైందో ఏమోగాని పేరుకు 50 మందికి పైబడి పోలీసు సిబ్బంది ఉన్నాగాని, రాజానగరంలో ట్రాఫిక్ డ్యూటీ చేసేవారు మాత్రం ఒక్కరు కూడా ఉండటం లేదు.

చర్యలు తీసుకుంటాం

రాజానగరంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించే దిశగా తగిన చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే పలుమార్లు పోలీసుల దృష్టికి తీసుకువెళ్లాం. మరోమారు పైఅధికారులతో మాట్లాడి, అవసరమైన చర్యలు తీసుకుంటాం.

– మేకా ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి, రాజానగరం

అధికారులకు వినతి

సీతానగరం: మండలంలోని ఇసుక ర్యాంపులలో జరుగుతున్న అక్రమ తవ్వకాలు, నిల్వలు, రవాణాలపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ టీడీపీ నియోజకవర్గం ఇన్‌చార్జి వెంకట రమణ చౌదరి మంగళవారం తహసీల్దార్ ఎస్.సత్యనారాయణ రాజు, ఎస్సై కె.చిరంజీవికి వినతిపత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ ఇసుక సత్యాగ్రహం కార్యక్రమంలో భాగంగా అక్రమ ఇసుక తవ్వకాలపై చర్యలు తీసుకోవాలని అధికారులను కోరామన్నారు.

ఐఎస్‌టీఎస్‌లో హీరో నవీన్ సందడి



మాట్లాడుతున్న హీరో నవీన్

రాజానగరం: జాతీయ రహదారిని ఆనుకుని తూర్పుగానుగూడెంలో ఉన్న ఐఎస్‌టీఎస్ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో మిస్ శెట్టి, మిస్టర్ పోలిశెట్టి చిత్ర బృందం మంగళవారం సాయంత్రం సందడి చేసింది. ఆ సినిమా ప్రమోషన్‌లో భాగంగా హీరో నవీన్ (జాతిరత్నాలు ఫేమ్) తదితరులు అక్కడకు వచ్చారు. సినిమా విశేషాలను వివరించారు.

క్రీడలతో విద్యార్థుల్లో మేధోవికాసం



క్రీడాకారుడు బుద్ధావతారం రాజును సన్మానించి, జ్ఞాపిక అందజేస్తున్న వీసీ ఆచార్య పద్మరాజు



సీతానగరం హైస్కూల్ హెచ్‌ఎం వీరభద్రరావుకు సన్మానం



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న ఉపాధ్యాయులు

- నన్నయ వీసీ ఆచార్య పద్మరాజు
- ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం

రాజానగరం: క్రీడల ద్వారా మానసిక ఉల్లాసం, శరీర దారుఢ్యంతో పాటు మేధో సంపత్తి వృద్ధి చెందుతుందని ఆదికవి నన్నయ యూనివర్సిటీ వీసీ ఆచార్య కె.పద్మరాజు అన్నారు. హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని యూనివర్సిటీలో మంగళవారం నేషనల్ స్పోర్ట్స్‌డే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాల వేసి, ఘనంగా నివాళులర్పించి, ఫిట్ ఇండియా ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ధ్యాన్‌చంద్ క్రీడా స్ఫూర్తితో యూనివర్సిటీ ఖ్యాతిని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో నిలిపాలన్నారు. ఇందులో భాగంగా ఖేలో ఇండియా నిధులతో ప్రాంగణంలో మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం, స్విమ్మింగ్ పూల్ నిర్మాణాలు చేపట్టామన్నారు. కాకినాడ క్యాంపస్‌లో కూడా క్రీడాభివృద్ధికి ప్రణాళికలను, ప్రతిపాదనలను పంపిస్తున్నామన్నారు. ఖేలో ఇండియా పోటీలలో యూనివర్సిటీ క్రీడాకారులు సిల్వర్ మెడల్ సాధించారని తెలిపారు. క్రీడలను, క్రీడాకారులను ప్రోత్సహించే విధంగా రాష్ట్రంలో అతి తక్కువ ఫీజుతో ఎంపీఈడీ కోర్సును అందిస్తున్నామన్నారు. అనంతరం సుమారు 125 టెన్నిస్ టోర్నమెంట్లను గెలుచుకున్న నేషనల్ బాల్ బ్యాడ్మింటన్, టెన్నిస్ ప్లేయర్ బుద్ధావతారం రాజును సన్మానించి, జ్ఞాపిక అందజేశారు. అలాగే నేషనల్ స్పోర్ట్స్ డే సందర్భంగా నిర్వహించిన పోటీలలో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు పతకాలు అందజేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, చీఫ్ కోచ్ డీఎంఎం శేషగిరి, ఫిజికల్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ బి.రామగోపాల్, కోర్స్ కోఆర్డినేటర్ డాక్టర్ కె.బాలసత్యనారాయణ పాల్గొన్నారు.

సీతానగరం: స్థానిక ప్రభుత్వ హైస్కూల్లో జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటానికి ఎంఈవో కె.స్వామి నాయక్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ప్రధానోపాధ్యాయుడు ఎం.వీరభద్రరావు, పీడీ సింహాద్రిని సన్మానించారు. అనంతరం విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు.

ఘనంగా క్రీడా దినోత్సవం

మధురపూడి: కోరుకొండ మండలం కణుపూరు హైస్కూల్లో మంగళవారం క్రీడా దినోత్సవం ఘనంగా జరిగింది. ఒలింపిక్స్‌లో హాకీ క్రీడలో దేశానికి బంగారు పతకాన్ని తీసుకొచ్చిన మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని ఈ కార్యక్రమం జరిపారు. హైస్కూల్లో ఇటీవల నిర్వహించిన క్రీడాపోటీల్లో విజేతలైన 82 మంది విద్యార్థులకు పతకాలు, ట్రోఫీలు అందజేశారు. పేరెంట్స్ కమిటీ చైర్మన్ ఎల్లపు శ్రీనివాస్ క్రీడాకారులైన విద్యార్థులకు స్పోర్ట్స్ దుస్తులు పంపిణీ చేశారు. పోటీల్లో విజేతకు వైస్ చైర్మన్ మంచాల చిట్టిబాబు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వి.శ్రీనివాసరావు, పీడీ ఎస్ఎస్‌వీ శివ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే క్రీడల్లో రాణించాలి



సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయుడు జి.శ్రీనివాస్‌ను సత్కరించిన ఉపాధ్యాయులు



కొంకుదురులో సూర్యనారాయణరెడ్డిని సత్కరిస్తున్న సర్పంచ్ వీరమణి

అనపర్తి: విద్యార్థి దశ నుంచే క్రీడలపై ఆసక్తిని పెంపొందించుకుని రాణించాలని స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాల హెచ్‌ఎం కల్యాణి అన్నారు. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం పాఠశాలలో క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు జి.శ్రీనివాస్‌ను పాఠశాల సిబ్బంది ఘనంగా సత్కరించారు. వివిధ క్రీడా పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు.

బిక్కవోలు: జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని కొంకుదురు ఉన్నత పాఠశాలలో హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీనియర్ కబడ్డీ క్రీడాకారుడు సత్తి సూర్యనారాయణరెడ్డిని సర్పంచ్ సత్తి వీరమణి సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కొంకుదురు పీవీ, సొసైటీ అధ్యక్షుడు సత్తి నాగిరెడ్డి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ప్రచార కమిటీ చైర్మన్ రొంగల అప్పాజీ, హెచ్‌ఎం మల్లిపూడి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పెదపూడి: జి.మామిడాడ జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల్లో జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని హెచ్‌ఎం కె.శ్రీనివాస్ హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంఈఓ-2 సీవీవీ సత్యనారాయణ మాట్లాడుతూ ధ్యాన్‌చంద్ లాంటి క్రీడాకారులను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అనంతరం క్రీడా పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జి.సత్యవతి, కె.విజయలక్ష్మి, యు.పార్వతి, ఎ.వెంకటేశ్వరరావు, ఐ.గోపాలకృష్ణ పాల్గొన్నారు.

ఎన్నికల్లో విజయమే లక్ష్యం

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- అనుబంధ విభాగాల అధ్యక్షులకు దిశానిర్దేశం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

రాజానగరం: రాబోయే సార్వత్రిక ఎన్నికలలో విజయమే లక్ష్యంగా పనిచేయాలని స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు జక్కంపూడి రాజా అన్నారు. రాజమహేంద్రవరంలోని తన కార్యాలయంలో సీతానగరం, కోరుకొండ, రాజానగరం మండలాలకు సంబంధించి అనుబంధ విభాగాల అధ్యక్షులతో మంగళవారం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. 2019 ఎన్నికల సమయంలో అనుబంధ విభాగాలు ఏ విధంగా పనిచేశాయో వివరిస్తూ, అంతకు మించిన పట్టుదలతో 2024 ఎన్నికలలోనూ విజయమే లక్ష్యంగా పనిచేయాలని వారికి దిశ నిర్దేశం చేశారు. సెప్టెంబర్ 20వ తేదీలోగా గ్రామ కమిటీలను ఏర్పాటు చేసి, పార్టీని మరింత బలోపేతం చేయాలన్నారు. ఈ సమయంలో విభేదాలకు తావు లేకుండా అందరినీ కలుపుకొని ముందడుగు వేయాలన్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలకు గత నాలుగున్నరేళ్లుగా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, అందుకుంటున్న ప్రయోజనాలను వివరించాలన్నారు. పార్టీ కోసం అహర్నిశలు పాటుపడిన వారికి తగిన గుర్తింపు కూడా లభిస్తుందన్నారు. అనుబంధ విభాగాలకు ఇన్‌చార్జిగా కొండగుంటూరుకు చెందిన రాయుడు వ్యవహరిస్తారని, అతని సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పారదర్శకంగా ఇసుక పంపిణీ

- ఓర్వలేకే టీడీపీ నాయకుల నిందలు
- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- రాజవరంలో గడప గడపకూ..



రాజవరంలో ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

మధురపూడి: ఏపీఎండీసీ ద్వారా ఆన్‌లైన్ పద్ధతిలో ఇసుకను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చి, సక్రమంగా నిర్వహిస్తుంటే ఓర్వలేక టీడీపీ నాయకులు నిందారోపణలు చేస్తున్నారని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా ఆగ్రహం వ్యక్తం చేశారు. కోరుకొండ మండలం రాజవరంలో మంగళవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడుతూ ఇసుకను పారదర్శకంగా అందరికీ అందుబాటులోకి తీసుకొచ్చిన ఘనత రాష్ట్ర ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఈ రోజు రూ.కోట్లు ప్రభుత్వానికి ఆదాయం వస్తుంటే, ఆనాడు చంద్రబాబు పాలనలో ఉచితం పేరిట ఇసుక దోపిడీకి చంద్రబాబు, కొడుకు లోకేష్, నాటి ఎమ్మెల్యే తెరతీశారన్నారు. ఇసుక దోపిడీలో వాటాల పంపకాల్లో అవకతవకల కారణంగానే రాజానగరం నియోజకవర్గంలో రాజకీయ సమీకరణలు మారాయన్నారు. నాడు జరిగిన దోపిడీ విషయమై టీడీపీ ఇన్‌చార్జిగా వచ్చిన బొడ్డు వెంకట రమణ చౌదరి మనస్సాక్షిని ప్రశ్నించుకోవాలని హితవు పలికారు.

ఆప్యాయంగా పలకరిస్తూ..

ప్రజలందరినీ ఆప్యాయంగా పలకరిస్తూ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత వీరాంజనేయ స్వామిని దర్శించుకున్న ఆయన స్థానిక విష్ణ్వేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేశారు. గ్రామంలో చేసిన అభివృద్ధి పనులను వివరించారు. రాత్రి 10 గంటల వరకూ నిర్వహించిన కార్యక్రమంలో 300 గడపలు తిరిగారు. కార్యక్రమంలో రాజవరం సర్పంచ్ అడపా విశాలాక్షి, జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు, పార్టీ మండల కన్వీనర్ గణేశుల పోసి, పార్టీ నాయకులు అడపా సురేంద్ర, కళ్యాణం రాంబాబు, సంగన రామకృష్ణ, సూరిశెట్టి కుటుంబరావు, డి.వరప్రసాద్, చేనేత విభాగం మండల కన్వీనర్ నేమాల వీర్రాజు, మంచాల చిట్టిబాబు పాల్గొన్నారు.

గిడుగు రామ్మూర్తి కృషి చిరస్మరణీయం



రంగంపేట ఉన్నత పాఠశాలలో వివిధ వేషధారణల్లో విద్యార్థులు



గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీడీఓ విజయభాస్కర్



అనపర్తి పాతవూరులో వివిధ పోటీల్లో బహుమతులు అందుకున్న విద్యార్థులు

పెదపూడి: గ్రాంథిక భాషలో ఉండే పాఠ్యాంశాలను వాడుక భాషలోకి మార్చి తెలుగు భాషాభివృద్ధికి గిడుగు రామ్మూర్తి పంతులు చేసిన కృషి చిరస్మరణీయమైనదని ఎంపీడీఓ పి.విజయభాస్కర్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం గిడుగు వెంకటరామ్మూర్తి పంతులు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధి హామీ పథకం ఏపీఓ కాంచన, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బిక్కవోలు: బిక్కవోలు ఉన్నత పాఠశాలలో జరిగిన మాతృభాషా దినోత్సవంలో గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి ప్రధానోపాధ్యాయుడు పి.వీరప్రభాకర్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు భాష అభ్యున్నతికి అందరూ పాటుపడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలోని ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రంగంపేట: వ్యవహారిక తెలుగు భాషాభివృద్ధికి విశేష కృషి చేసిన గిడుగు వెంకట రామ్మూర్తి పంతులు సేవలు ఎనలేనివని గ్రంథాలయాధికారి ఎస్.కోటేశ్వరరావు అన్నారు. మంగళవారం స్థానిక శాఖా గ్రంథాలయంలో తెలుగు భాషా దినోత్సవం, గిడుగు రామ్మూర్తి పంతులు 160వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా గిడుగు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం తెలుగు వ్యాకరణం, శతక పద్యాలు, పొడుపు కథలు, నీతి కథల పుస్తకాలు ప్రదర్శించారు. చంద్రేడు, జి.దొంతమూరు, పాత వీరంపాలెం, రంగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో తెలుగు భాషా దినోత్సవం నిర్వహించారు. విద్యార్థుల వేషధారణలు ఆకట్టుకున్నాయి.

అనపర్తి: తెలుగు భాషాభివృద్ధికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని అనపర్తి ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ తాడి రామగురెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక తెలుగు భాషాభిమాన సంఘం ఆధ్వర్యంలో స్థానిక పాతవూరులని కేపీఆర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం కె.సుజాత అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి డాక్టర్ రామగురెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 నల్లమిల్లి సత్తిరెడ్డి, సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వైవీఎస్ ఆచార్యులు, కె.కిషోర్‌కుమార్, అంగర వంశీకృష్ణ, చేవలి శ్రీనివాస్, చింతా నాగురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

బిక్కవోలు: మండలంలోని పందలపాక ఉన్నత పాఠశాలలో మంగళవారం తెలుగు భాషా, క్రీడా దినోత్సవాలను పురస్కరించుకుని గిడుగు రామ్మూర్తి, ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ అలరించాయి. అనంతరం వివిధ ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం చింతాశ్రీనివాసరెడ్డి, పీడీ ద్వారంపూడి యువరాజారెడ్డి, పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ కోనాల సత్తిరాజు తదితరులు పాల్గొన్నారు.



నన్నయలో కూచిపూడి నృత్య ప్రదర్శన

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు

రాజానగరం: తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా ఆదికవి నన్నయ యూనివర్సిటీలో కూచిపూడి డిప్లమా కోర్సు చేస్తున్న విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ఆహూతులను రంజింపజేశాయి. సంప్రదాయ సాహిత్యంతో సాగిన ఈ నృత్య ప్రదర్శనలో విద్యార్థులు తమలోని ప్రతిభను ప్రదర్శించేందుకు పోటీపడ్డారు. తెలుగు శాఖ, రాష్ట్ర తెలుగు, సంస్కృతిక అకాడమీల సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం ఈ కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వర్రావు, ఎంపీ మార్గాని భరత్‌రామ్, వీసీ ఆచార్య కె.పద్మరాజు, అకాడమీ చైర్‌పర్సన్ నందమూరి లక్ష్మీపార్వతి, పలువురు సాహితీవేత్తలు వారిని అభినందించారు.



పందలపాక ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన



దివాన్ చెరువులో తెలుగు ఉపాధ్యాయులను సత్కరిస్తున్న సేవ ఉగాది ప్రతినిధులు

మధురపూడి: కోరుకొండ మండలం కాపవరంలోని ఎంపీడీఓ కార్యాలయంలో తెలుగు భాషా దినోత్సవం ఘనంగా జరిగింది. ఎంపీడీఓ పీఎస్ నరేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. దోసకాయలపల్లి గ్రంథాలయంలో లైబ్రేరియన్ సత్యనారాయణ ఆధ్వర్యంలో గిడుగు వెంకట రామమూర్తి చిత్రపటానికి పూలమాలలు వేశారు.

ఉపాధ్యాయులకు సత్కారం

రాజానగరం: తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా దివాన్‌చెరువు జెడ్పీ ఉన్నత పాఠశాలలో తెలుగు భాషను బోధించే ఉపాధ్యాయులను మంగళవారం ఘనంగా సన్మానించారు. అదే గ్రామానికి చెందిన సేవ ఉగాది స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు గ్రంధి గణేష్ గుప్తా, నీలపాల శ్రీనివాసరావు జ్ఞాపికలను బహూకరించారు.

కన్నబాబును కలిసిన ఏడుకొండలు



కాకినాడలో కన్నబాబును మర్యాద పూర్వకంగా కలిసిన ఏడుకొండలు

గోకవరం: వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడిగా మూడోసారి నియమితులైన కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబును ఉభయ గోదావరి జిల్లాల ఎస్సీ సెల్ జోనల్ ఇన్‌చార్జి గుల్లా ఏడుకొండలు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన వెంట గుడాల రామకృష్ణ, దాకే రఘు, ఇజ్జిన కిరణ్ కుమార్, పత్తి రమేష్ తదితరులు ఉన్నారు.

సీటెట్‌కు అర్హత కల్పించాలని వినతి

రాజానగరం: తెలుగు పండిట్ శిక్షణ పూర్తి చేసిన వారికి సీటెట్ రాయడానికి అర్హతను ఎన్‌సీటీఈ కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఏపీ రాష్ట్ర తెలుగు భాషా పండిత శిక్షణ పొందిన నిరుద్యోగులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. టీపీటీ చదివిన వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధ్యాయ సెలక్షన్స్‌లో అవకాశం కల్పించాలన్నారు. ఈ మేరకు మంగళవారం నన్నయ వర్సిటీకి వచ్చిన రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు వినతిపత్రం అందజేశారు.

ట్రక్కు ఢీకొని గేదె మృతి

సీతానగరం: కాటవరంలోని బుడ్డిగ పెద వీర్రాజుకు చెందిన చూడి గేదెను ట్రక్కు వెనుక నుంచి ఢీకొంది. పెద వీర్రాజు సోమవారం అర్ధరాత్రి 12 గంటలకు తన గేదెను తీసుకువస్తుండగా రాజమహేంద్రవరం నుంచి వస్తున్న ట్రక్కు వెనుక నుంచి ఢీకొట్టడంతో గేదె మృతి చెందింది. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్సై కె.చిరంజీవి కేసు నమోదు చేశారు.